## ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట


ఆసుపత్రి ప్రారంభోత్సవంలో మంత్రి రాజనరసింహా

**సుభాష్‌నగర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ.. ముందుకు సాగుతోందని రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనరసింహా అన్నారు. శనివారం గాజులరామారం డివిజన్ మహాదేవపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన లలితా మల్టీ ఫెసిలిటీ ఆస్పత్రిని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆసుపత్రి యాజమాన్యం కృషి చేయాలన్నారు. ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. లాభాపేక్షతో కాకుండా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తాము 100 పడకాల ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కార్పొరేటర్లు రావుల శేషగిరి, జగన్, సత్యనారాయణ, సురేష్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి, చేవెళ్ల ఇన్‌చార్జి భరత్, ఆస్పత్రి సీఈఓ హరీష్‌రెడ్డి, ఎండీ వై.యాదగిరిరెడ్డి, కో– ఆర్డినేటర్ పట్నాల జానకిరామయ్య తదితరులున్నారు.

# ఘనంగా హనుమాన్ జన్మదినోత్సవ వేడుకలు


ఉమామహేశ్వర ఆలయంలో ..

నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం హనుమాన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు భారీ క్యూలైన్లు కట్టి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హనుమంతుడికి ఆకుపూజ, సింధూరంతో అలంకరించి వడప్పాలమాలలతో అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో భారీ ఎత్తున భక్తజనం పాల్గొన్నారు.
–కుత్బుల్లాపూర్


కోటి లింగేశ్వరస్వామి ఆలయంలో ఈటల రాజేందర్, భరతసింహారెడ్డి


చెరుకుపల్లి కాలనీ హనుమాన్ ఆలయంలో..


టీఎస్ఐఐసీ కాలనీలో..


కాంగ్రెస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

## ప్రత్యేక పూజలు


అమ్మవారి సన్నిధిలో కూన శ్రీశైలంగౌడ్

**కుత్బుల్లాపూర్:** విజయవాడలోని శ్రీ కనకదుర్గ అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ దర్శించుకున్నారు. హనుమాన్ దీక్ష చేపట్టిన ఆయన కుమారుడు కృష్ణగౌడ్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న ఆయనకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేశారు.

## డాక్టర్ హుస్సేన్‌కు డాక్టరేట్



**సుభాష్‌నగర్:** కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన డాక్టర్ హుస్సేన్‌కు అరుదైన గుర్తింపు లభించింది. ఢిల్లీలోని 'హాలీడే ఇన్ హోటల్'లో శనివారం జరిగిన కార్యక్రమంలో జర్మనీకి చెందిన హాసన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి హానర్ ఆఫ్ డాక్టరేట్‌ను పొందారు. కరోనా సమయంలో ఆయన చేసిన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అందించినట్లు యూనివర్సిటీ ప్రతినిధులు తెలిపారు. తనకు డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు.

## తవ్వారు.. వదిలేశారు


జేసీబీతో రోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యం

**జీడిమెట్ల:** అధికారులు, కాంట్రాక్టర్ల అలసత్వం వాహనదారులకు ఇబ్బందిగా మారింది. జీడిమెట్ల రాంరెడ్డినగర్ నుంచి పారిశ్రామిక ప్రాంతం వైపు భూగర్భ డ్రైనేజీ నిమిత్తం కాంట్రాక్టర్ రోడ్డును కొంతమేర తవ్వి వదిలేశారు. వారం రోజులు గడుస్తున్నా.. అధికారులు పనులను చేపట్టలేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని త్వరిగతిన పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# కేసీఆర్ నిరాహారదీక్షతోనే ప్రత్యేక రాష్ట్రం


కుత్బుల్లాపూర్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

**కుత్బుల్లాపూర్:** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాదీక్ష ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం సాకారమైందని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన దశాబ్ది వేడుకల ముగింపు ఉత్సవాల్లో భాగంగా శనివారం కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ నుంచి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వివేకానంద్‌ల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు గన్‌పార్క్ నుంచి ట్యాంక్‌బండ్ వరకు చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో నీళ్లు, నియామకాలు లేక తెలంగాణ ప్రాంత ప్రజలు తీవ్ర వివక్షతకు గురయ్యారని, కేసీఆర్ మలి తెలంగాణ ఉద్యమాన్ని చేపట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి పెట్టారన్నారు. గత పదేళ్లుగా సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కేసీఆర్ కృషి చేశారన్నారు. నేడు కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ సందర్భంగా "జై తెలంగాణ' నినాదాలతో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక డివిజన్‌ల కార్పొరేటర్లు, బీఆర్ఎస్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## ఆకస్మిక తనిఖీలు


మ్యాన్‌హోళ్లను పరిశీలిస్తున్న అధికారులు

**చింతల్:** భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నిర్మాణాల పని తీరుపై శనివారం జలమండలి రెవెన్యూ సీజీఎం శ్రీధర్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గాజులరామారం, షాపూర్‌నగర్, సూరారం సెక్షన్లలో చేపడుతున్న నూతన పైప్‌లైన్ నిర్మాణం, మ్యాన్‌హోళ్ల మరమ్మతు పనులను డీజీఎం అప్పలనాయుడితో కలిసి సీజీఎం శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. సెక్షన్ మేనేజర్లు రోహిణి, రమ్య భారతి, అనూష పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడి రిమాండ్




**జగద్గిరిగుట్ట:** ఒంటరిగా ఉన్న మహిళల మెడల్లోంచి బంగారు ఆభరణాలను తెంపుకెళ్తూ.. తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని జగద్గిరిగుట్ట పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట రింగ్ బస్తీకి చెందిన అనసూయ అనే వృద్ధురాలు శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఇంటి తలుపులు తెరిచి నిద్రకు ఉపక్రమించింది. ఈ క్రమంలో శ్రీనివాస్‌నగర్‌కు చెందిన డ్రైవర్ షేక్ బాబా (33) ఇంట్లోకి చొరబడి ఆమె మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడును తెంపాడు. నిద్రలోంచి మేల్కొన్న బాధితురాలు గొలుసును లాక్కునేందుకు యత్నించగా.. నిందితుడు పరారయ్యాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రెండు గంటల వ్యవధిలోనే సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. చెడు వ్యసనాలను అలవాటుపడిన అతడు ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకుని నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం నిందితుడిని రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు వివరించారు.

# విద్యుత్ స్తంభం ఏర్పాటుపై వివాదం

**పరస్పరం దాడులు, ఇద్దరికి గాయాలు**

**దుండిగల్:** ఓ విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసే విషయంలో తలెత్తిన వివాదంలో ఇరు వర్గాలు పరస్పరం దాడులకు దిగాయి. ఈ ఘటనలో మహిళా కౌన్సిలర్‌తో పాటు మరో యువకుడు గాయపడ్డాడు. ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు దుండిగల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాల ప్రకారం... గాగిల్లాపూర్‌లో రమేష్ అనే వ్యక్తి ఇటీవల తన ఇంటి ప్రహరీని కూల్చి బోరు వేశాడు. తిరిగి ప్రహరీ నిర్మించేందుకు ప్రయత్నించాడు. ఇదే సమయంలో వీరి ఇంటి ఎదురుగా నివాసం ఉండే స్థానిక కౌన్సిలర్ భర్త నాగరాజు సదరు రమేష్ ఇంటి ముందు విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయిస్తానని చెప్పాడు. దీంతో ఇరువురి మధ్య మాటా మాటా పెరిగి గొడవకు దారి తీసింది. దీంతో ఇరు వర్గాలు అక్కడికి చేరుకుని బాహాబాహికి దిగి దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో కౌన్సిలర్ అరుణ తలకు గాయాలయ్యాయి. ఈ దాడిలో అజయ్ అనే యువకుడు కూడా గాయపడ్డాడు. ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు దుండిగల్ పోలీసులు ఇరువురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని..

**నిరుద్యోగులకు రూ.2 కోట్ల మేర కుచ్చుటోపీ**


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

**కుత్బుల్లాపూర్:** ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ.. నిరుద్యోగులకు రూ. 2 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా పిట్లం గ్రామానికి చెందిన కేతావత్ సంతోష్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షలు మొదలుకుని రూ.12 లక్షల వరకు వసూలు చేశారు. మొత్తంగా 50 మంది నుంచి రూ.2 కోట్ల వరకు తీసుకుని హాల్ టికెట్లు ఇవ్వడంతో పాటు పరీక్ష సైతం రాయించాడు. అపాయింట్‌మెంట్ లెటర్లను సైతం ఇచ్చి నమ్మించాడు. అయితే ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి చేరుకున్న బాధితులు తీరా వెళ్లాకా ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్లని తేలడంతో శనివారం పేట్‌బషీరాబాద్ పోలీసులను ఫిర్యాదు చేశారు. బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని పోలీసులు చెబుతున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సకాలంలో అభివృద్ధి పనులు


సాయినగర్‌లో కొనసాగుతున్న పైపులైన్ పనులు

**నిజాంపేట్:** బాచుపల్లిలోని 21 డివిజన్ సాయినగర్‌లో మంజీర వాటర్ లైన్ పైపులైన్ పనులను నిర్వహించారు. స్థానిక ప్రజలకు సరైన పైపులైన్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు నీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో పలుసార్లు స్థానిక కార్పొరేటర్ శిరీష నిజాంపేట్ కౌన్సిల్ సమావేశంలో దీనిపై చర్చించారు. గతంలోనే టెండర్లు పూర్తి కాగా.. పనులను పూర్తి చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.



## ఎన్నికల కౌంటింగ్‌పై కాంగ్రెస్ అవగాహన సదస్సు


సమావేశంలో ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు

**కుత్బుల్లాపూర్:** మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో కైవసం చేసుకోనుందని మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శనివారం తిరుమలగిరిలోని జయలక్ష్మి గార్డెన్‌లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌పై జరిగిన అవగాహన సదస్సులో ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓట్ల లెక్కింపు జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏజెంట్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. లోక్‌సభ స్థానాన్ని పార్టీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి కైవసం చేసుకోవడం దాదాపు ఖాయమైందని, కార్యకర్తలు ఉత్సవాలకు సిద్ధంగా ఉండాలన్నారు. కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు బండి రమేష్, పరమేశ్వర్ రెడ్డి, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లు లక్ష్మీకాంత్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, వెంకట్‌యాదవ్, కౌంటింగ్ ఏజెంట్లు తదితరులున్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**జగద్గిరిగుట్ట:** జగద్గిరిగుట్ట జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా జరిగింది. 2004–05 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఈ సమ్మేళనానికి హాజరై తమకు విద్య బోధించిన అధ్యాపకులను సన్మానించారు. విద్యార్థి స్థాయిలో గత అనుభవాలను నెమరువేసుకుని సందడి చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ప్రతి ఏడాది సమ్మేళనం నిర్వహిస్తూ.. తమ మధ్య స్నేహ బాంధవ్యాలను మరింత పటిష్టం చేసుకుంటామన్నారు.



# కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

**మొత్తం 28 టేబుళ్లు, 22 రౌండ్లు**

**కుత్బుల్లాపూర్:** లోక్‌సభ ఎన్నికల కౌటింగ్ సమయం దగ్గర పడుతుండటంతో అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 7,24,992 ఓటర్లు ఉండగా.. అందులో 3,63,874 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1,91,436 మంది పురుషులు, 1,72,390 మంది స్త్రీలు, 48 మంది ఇతరులు ఓటింగ్‌లో పాల్గొన్నారు.

◆ ఎన్నికల కౌటింగ్ ఈ నెల 4న కీసరలోని బోగారంలోని హోలీమేరి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓట్లు లెక్కించేందుకు అధికారులు మొత్తం 22 రౌండ్లతో పాటు మొత్తం 28 టేబుళ్లను సిద్ధం చేశారు.

**ఏజెంట్ల సమక్షంలోనే..**

పార్టీల కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఈ లెక్కింపు జరిగేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కౌంటింగ్‌ను అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ పూర్తయిన వెంటనే ఏ రౌండ్ ఫలితం ఆ రౌండ్ పూర్తవ్వగానే ప్రకటించనున్నారు. ప్రతి అరగంటకు ఒక్కసారి రౌండ్ల వారీగా ఫలితాలు వెల్లడించనున్నట్లు నియోజకవర్గ సహాయ ఎన్నికల అధికారి పులి సైదులు తెలిపారు.

◆ ఎన్నికల కౌటింగ్ ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు.

**ఆధిక్యం ఏవరిదో..?**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఆధిక్యం ఏ పార్టీ సాధిస్తుందోననే చర్చ జోరుగా జరుగుతోంది. కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, బీఆర్ఎస్ నుంచి రాగిడి లక్ష్మారెడ్డిలు ప్రధానంగా పోటీ పడినప్పటికీ ఏ పార్టీ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు లభిస్తాయో వేచి చూడాల్సిందే.

◆ కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ అని కొందరు అంటుండగా.. మూడు పార్టీల మధ్య గట్టి పోటీ ఉంటుందని మరి కొందరు వాదిస్తున్నారు. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బులాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీకి పెద్ద మొత్తంలో ఓట్లు లభించాయి. కానీ ఈసారి ఆ స్థాయిలో లభించే అవకాశాలు మాత్రం సన్నగిల్లినట్లు తెలుస్తోంది.

◆ బీఆర్ఎస్‌లోని పలువురు కీలక నాయకులు, ప్రజాప్రతినిధులు అటు కాంగ్రెస్‌లోకి కొంతమంది, ఇటు బీజేపీలోకి మరికొందలు వెళ్లడంతో బీఆర్ఎస్‌కు గండిపడే అవకాశం ఎక్కువగా ఉంది. మరి ఈ ఓట్లు ఎవరికి కలిసి వస్తుందో..? మరి ఏదేమైనా మరో రెండ్రోజుల్లో ఫలితాలు వెల్లడికానున్నాయి.



## హోటల్ కిచెన్‌లో నీళ్లు పడుతూ..

– గుర్తు తెలియని వ్యక్తి మృతి


చెన్నయ్య మృతదేహం

**దుండిగల్:** హోటల్ కిచెన్‌లో నీళ్లు పడుతూ.. ఓ వ్యక్తి సొమ్మసిల్లి మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పల్లి పెట్రోల్‌బంక్ సమీపంలో ఇటీవల తెలుగు కిచెన్ హోటల్‌ను ప్రారంభించారు. సికింద్రాబాద్‌లో అడ్డా కూలీగా పనిచేస్తున్న చెన్నయ్య(55)ను మూడ్రోజుల క్రితం హౌజ్ కీపింగ్ పనికోసం తీసుకొచ్చారు. శనివారం ఉదయం హోటల్‌లోని కిచెన్‌లో నీటిని పడుతున్న క్రమంలో చెన్నయ్య సొమ్మసిల్లి కుప్పకూలిపోయాడు. వెంటనే సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. హోటల్ నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుండెపోటుతో మృతి చెందాడా.. ఇతర కారణాలు పోస్టుమార్టం నివేదికలో తెలుస్తాయని పోలీసులు చెబుతున్నారు. మృతుడి పేరు తప్ప పూర్తి వివరాలు తెలియదని నిర్వాహకులు వివరించారు.

# ఓవర్‌లోడ్‌తో తెగిపడిన విద్యుత్ తీగలు

- తీవ్ర ఇబ్బంది పడిన ప్రజలు
- అధిక వేడితో పెరిగిన విద్యుత్ వినియోగం
- పునరుద్ధరణకు 3 గంటలు


విద్యుత్ తీగలు తెగిపడటంతో ఘటనా స్థలంలో మంటలు

**నిజాంపేట్ :** ఓ వైపు మండుతున్న ఎండలు మరో వైపు ఉక్కపోతతో ప్రజలు అల్లడుతున్నారు. దీనికి తోడు రాత్రి సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండటంతో ప్రజల కష్టాలు వర్ణనాతీతం. శుక్రవారం రాత్రి 10:30 గంటల నుంచి అర్ధరాత్రి 1:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఉక్కపోతతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. కరెంట్ వచ్చే వరకు ప్రజలంతా నిద్రలేకుండా గడిపారు. విద్యుత్ అధికారులకు ఫోన్లు చేసిన విద్యుత్ సరఫరా వచ్చే వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**చెలరేగిన మంటలు..**

శుక్రవారం రాత్రి బాచుపల్లిలోని 33కేవీ ఫీడర్ ఓవర్‌లోడ్‌తో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడమే కాకుండా ఘటన జరిగిన టీనా ల్యాబ్స్ వద్ద మంటలు సైతం చెలరేగాయి. రాత్రి సమయంలో ప్రజలు చాలా వరకు ఏసీలు ఆన్ చేయడంతో విద్యుత్ వినియోగం పెరిగిపోతోంది. దీంతో ఒక్కసారిగా 340 ఆమ్స్ మించిపోవడంతో ఈ సంఘటన జరిగిందని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు బాచుపల్లి సబ్‌స్టేషన్‌లో ప్రత్యమ్నాయం లేకపోవడంతో మరమ్మతులు చేసే వరకు సుమారు 3 గంటలు కరెంట్ కోసం ఆగాల్సిన పరిస్థితి వచ్చింది.

**సరఫరా నిలిచిపోయిన ప్రాంతాలు..**

విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ప్రాంతాలు బాచుపల్లి, ఐడీపీఎల్ కాలనీ, కేఆర్‌సీఆర్ కాలనీ, సాయినగర్, రాజీవ్ గృహకల్ప, శ్రీహోమ్స్ కాలనీ, ఇంద్రనగర్ కాలనీ, సాయిఅనురాగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

**విద్యుత్ అధికారుల మరమ్మతులు..**

బాచుపల్లి 33కేవీ విద్యుత్ లైన్ తెగిపడటంతో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో ఏఈ శాంతా కుమారి ఆధ్వర్యంలో సిబ్బంది వేగవంతంగా మరమ్మతులు ప్రారంభించారు. భౌరంపేట్‌లో 220కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే ఇలాంటి సమస్య పునరావృత్తం అయినప్పటికీ వెంటనే విద్యుత్‌ను భౌరంపేట్ సబ్‌స్టేషన్ నుంచి ఇచ్చే అవకాశం ఉంటుంది. ఈ పనులు మరో మూడు నెలల్లోగా పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**బాచుపల్లిలో సబ్‌స్టేషన్ వద్ద ధర్నా..**

బాచుపల్లిలోని ప్రజలు ఉక్కబోత భరించలేక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని రోడ్డుపై ధర్నా చేపట్టి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని శాంతింపజేశారు.

## 12 గంటలు నిలిచిన విద్యుత్ సరఫరా..

**చింతల్:** సుమారు 12 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయినా అధికారుల్లో చలనం లేదని చింతల్ డివిజన్ స్ఫూర్తినగర్ వాసులు ఆరోపిస్తున్నారు. పట్వారి ఎన్‌క్లేవ్ స్ఫూర్తినగర్‌లో శుక్రవారం రాత్రి 9 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శనివారం మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ ఎక్కువై సరఫరాకు అంతరాయం కలుగుతున్నాయని స్థానిక బీజేపీ నేత కొట్టే సదానంద్ విమర్శించారు. స్థానికంగా కొత్తగా ఇళ్లు, అపార్టుమెంట్లు వెలిసినా దీనికి తగినట్లుగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయపోవడంతోనే లోడ్ ఎక్కువై విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. దాదాపు 18 గంటల పాటు ఏ ఒక్క అధికారి పట్టించుకున్న దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు.